# సాక్షి నారాయణపేట

మంగళవారం । 23 । ఏప్రిల్ । 2024






## పబ్బతి అంజన్న ఉత్సవాలు

మద్దిమడుగులో పబ్బతి అంజన్న మాల విరమణ భక్తిశ్రద్ధలతో కొనసాగుతోంది.

వివరాలు 8లో ▸



## బావాజీ జాతర

గిరిజనుల ఆరాధ్య దైవం బావాజీ ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
43.0 /24.3

## వాతావరణం

ఎండ తీవ్రత రోజురోజుకు పెరుగుతుంది. మధ్యాహ్నం ఉక్కపోత తప్పదు. అప్పుడప్పుడు వడగాలులు వీస్తాయి.

## న్యూస్‌రీల్

### 107 కొనుగోలు కేంద్రాలు

**నారాయణపేట:** యాసంగి వరి ధాన్యం కొనుగోలుకు జిల్లాలో 107 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏ–గ్రేడ్ ధాన్యం క్వింటాకు రూ.2,203, కామన్ ధాన్యానికి రూ 2,183 ధర నిర్ణయించామని, 1.35 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేందుకు అంచనా వేసినట్లు పేర్కొన్నారు. గన్నీ సంచులు, తేమ కొలిచే, ధాన్యం శుభ్రపర్చే, తూకం యంత్రాలు, టార్పాలిన్లు సమకూర్చామన్నారు. ధాన్యం తూకం వేసిన వెంటనే వివరాలు ఆన్‌లైన్‌లో నమోదుచేసి ట్యాగ్ చేసిన మిల్లుకు మాత్రమే తరలించాలని సూచించారు. బాగా ఆరబెట్టి శుద్ధిచేసిన ధాన్యాన్ని మాత్రమే కేంద్రాలకు తీసుకురావాలన్నారు.

### వనరులు కాపాడుకోవాలి : డీఈఓ



**నారాయణపేట రూరల్:** ప్రకృతి ప్రసాదించిన వనరులను ప్రతి ఒక్కరు బాధ్యతగా కాపాడుకోవాలని డీఈఓ ఎండీ అబ్దుల్ ఘని కోరారు. దరిత్రి దినోత్సవ వేడుకలను సోమవారం స్థానిక ఎమ్మార్సీలో నిర్వహించారు. ఈ సందర్భంగా భూమి పరిరక్షణకు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, ఉపాధ్యాయులు విధిగా విద్యార్థులకు భూమి ప్రాముఖ్యతను తెలియజేయాలన్నారు. ఏఎంఓ విద్యాసాగర్, సెక్టోరియల్ అధికారులు నాగార్జున్ రెడ్డి, శ్రీనివాస్, రాజేంద్రకుమార్, పరీక్షల విభాగం అధికారి రమేష్‌శెట్టి పాల్గొన్నారు.

■ జిల్లాలో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ ద్వారా ఎంపిక చేయబడ్డ పాఠశాలల్లో సోమవారం దరిత్రి దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సైన్స్ టీచర్ల ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేశారు. జాజాపూర్ స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో డీఎస్‌ఓ భానుప్రకాష్ పాల్గొని విద్యార్థులకు భూమి ప్రాముఖ్యతను తెలియచేశారు.

● చివరి రా'రాజు'.. మొదటి ఎంపీ

# సంస్థానం టు పార్లమెంట్

## ఐదుసార్లు ఎంపీగా గెలిచిన వనపర్తి సంస్థానాధీశుడు

- నాలుగుసార్లు మహబూబ్‌నగర్, ఒకసారి నాగర్‌కర్నూల్ నుంచి గెలిచిన రాజారామేశ్వర్‌రావు
- పలు దేశాల్లో భారత రాయబారిగా పనిచేసిన అనుభవం
- 1980లో ఓటమి తర్వాత రాజకీయాలకు దూరం

గతం

స్వతంత్ర భారతంలో రాజరికపు ఆనవాళ్లు అంతరించిపోగా.. రాజ్యాలన్నీ ఇండియన్ యూనియన్‌లో విలీనమయ్యాయి. సంస్థానాధీశులుగా పాలన సాగించిన రాజులు ప్రజాస్వామ్య పద్ధతిలో జరిగిన ఎన్నికల్లో పోటీచేసి చట్టసభల్లో అడుగుపెట్టారు. అలా వనపర్తి సంస్థానం చివరిరాజు జనుంపల్లి రామేశ్వర్‌రావు రాజకీయాల్లోకి వచ్చి వరుసగా ఐదుసార్లు ఎంపీగా విజయకేతనం ఎగురవేశారు.

– మహబూబ్‌నగర్ డెస్క్



ఓటమి తర్వాత రాజకీయాలకు దూరం..

వనపర్తి సంస్థానం చివరి రాజుగా జనుంపల్లి రాజారామేశ్వర్‌రావు (1944 సంవత్సరం)లో పట్టాభిషిక్తుడయ్యారు. 21 ఏళ్ల వయసులో రాజ్యపాలన చేపట్టిన ఆయన నిజాం ప్రభువుకు సామంతరాజుగా ఉంటూ పాలన సాగించారు. 1947లో స్వాతంత్ర్యం రావడంతో.. వనపర్తి సంస్థానాన్ని ఇండియన్ యూనియన్‌లో విలీనం చేసేందుకు రామేశ్వర్‌రావు అప్పటి ప్రధాని నెహ్రూతో ఒప్పందం చేసుకున్నారు. 1949లో ఇండియన్ ఫారిన్ సర్వీస్‌లో చేరి, పలు ఆఫ్రికన్ దేశాలలో భారత ప్రభుత్వానికి కమిషనర్‌గా పనిచేశారు. 1957లో దేశవ్యాప్తంగా జరిగిన రెండో సార్వత్రిక ఎన్నికల్లో మహబూబ్‌నగర్ లోక్‌సభ స్థానంలో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీచేసి తొలిసారి ఎంపీగా గెలుపొందారు. 1962లో ఉమ్మడి జిల్లాలో రెండు ఎంపీ స్థానాలు ఏర్పాటు చేశారు. అప్పుడు కొత్తగా ఏర్పడిన నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానంలో పోటీ చేసి విజయం సాధించారు. ఆ తర్వాత 1967లో తిరిగి మహబూబ్‌నగర్‌లో పోటీ చేసి మూడోసారి ఎంపీగా పార్లమెంట్‌లో అడుగుపెట్టారు. అనంతరం 1972, 1977లో జరిగిన ఎన్నికల్లోనూ వరుసగా విజయం సాధించారు. 1977లో దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఓటమిపాలైనా నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని 42 పార్లమెంట్ స్థానాల్లో 40 స్థానాలు కాంగ్రెస్ గెలిచింది. అందులో మహబూబ్‌నగర్ ఎంపీగా రాజా రామేశ్వర్‌రావు విజయకేతనం ఎగురవేశారు. 1977లో కేంద్రంలో ఏర్పడిన



అప్పటి ప్రధాని నెహ్రూతో రాజా రామేశ్వర్‌రావు (ఫైల్)

జనతా ప్రభుత్వం మూడేళ్లకే పడిపోవడంతో 1980లో మధ్యంతర ఎన్నికలు వచ్చాయి. నాడు ఇందిరా కాంగ్రెస్‌గా పార్టీని వేరుచేసిన ఇందిరాగాంధీ మహబూబ్‌నగర్ నుంచి పోటీ చేయాలని అనుకున్నారు. కాగా.. ఐదుసార్లు వరుసగా గెలుస్తున్న రామేశ్వర్‌రావుపై పోటీచేయడం ఎందుకని మెదక్ సిట్టింగ్ ఎంపీ మల్లికార్జున్‌గౌడ్‌ను పాలమూరులో పోటీకి నిలబెట్టి.. ఆమె మెదక్‌లో పోటీ చేసి గెలిచారు. ఆ ఎన్నికల్లో రామేశ్వర్‌రావుపై మల్లికార్జున్ సంచలన విజయం సాధించారు.

1948లో ఓరియంట్ లాంగ్‌మన్ (ఇప్పుడు ఓరియంట్ బ్లాక్‌స్వాన్)ను ప్రత్యేకంగా భారతీయ పుస్తక ప్రచురణ సంస్థగా స్థాపించారు. రామేశ్వరరావు 1949లో ఇండియన్ ఫారిన్ సర్వీసులో చేరి 1950–52 మధ్య ఆఫ్రికా దేశం కెన్యాలోని నైరోబిలో ప్రథమ భారతీయ రాయబారిగా పనిచేశారు. 1953 నుంచి 1956 వరకు గోల్డ్‌కోస్ట్ (ఘనా), నైజీరియాలకు భారత రాయబారిగా ఉన్నారు. 1958లో ఐక్యరాజ్య సమితికి భారతీయ బృందంలో, 1960–61లో ఐక్యరాజ్య సమితి కాంగో కన్సీలియేషన్ కమిషన్‌లో, 1964–65లో అల్జీర్స్‌లో జరిగిన ఆఫ్రో–ఆసియా సదస్సులో సభ్యుడిగా ఉన్నారు. 1957 నుంచి 1980 వరకు పార్లమెంట్ సభ్యుడిగా రామేశ్వరరావు పార్లమెంట్ విదేశాంగ వ్యవహారాల సలహా సంఘంలోనూ, ప్రణాళికా సలహా సంఘంలోనూ సభ్యుడిగా పనిచేశారు. 1980 ఎన్నికల్లో ఓటమి తర్వాత మళ్లీ ప్రత్యక్ష రాజకీయాల్లోకి రాలేదు. తొలిసారి ఎంపీగా గెలిచిన తర్వాత వనపర్తి రాజప్రసాదం (బంగ్లా)ను ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలకు ఇచ్చి.. ప్రారంభోత్సవానికి అప్పటి ప్రధాని నెహ్రూను వనపర్తికి తీసుకువచ్చారు.

# వైద్య కళాశాల నిర్మాణం పూర్తి చేయాలి

● కలెక్టర్ కోయ శ్రీహర్ష

**నారాయణపేట:** వైద్య కళాశాల నిర్మాణం నెలాఖరులోగా పూర్తి చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష కోరారు. సోమవారం మండలంలోని అప్పక్‌పల్లి వద్ద నిర్మాణంలో ఉన్న జిల్లా ఆస్పత్రి భవనంలో కొనసాగుతున్న మెడికల్ కళాశాల పనులను ఆయన పరిశీలించారు. నిర్మాణం పూర్తయిన గదుల ఎదుట ఆయా డిపార్ట్‌మెంట్ల పేర్లను పెద్ద అక్షరాలతో రాయించాలని సూచించారు. అంతకుముందు జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఉన్న వైద్య కళాశాల ప్రిన్సిపల్ గదిలో అధికారులతో సమావేశమయ్యారు. వైద్య కళాశాలలో విధులు నిర్వర్తించే వైద్యుల హాజరును బయోమెట్రిక్ ద్వారా నమోదు చేయాలన్నారు. అలాగే ఆస్పత్రి



జిల్లా ఆస్పత్రిలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పైఅంతస్తులో ఇటీవల ఏర్పాటు చేసిన కొత్త వార్డ్, స్టోర్‌రూమ్‌ను పరిశీలించారు. వైద్య విద్య డీఎంఈ శివప్రసాద్, మహబూబ్‌నగర్ మెడికల్ కళాశాల డైరెక్టర్ డా. రమేష్, నారాయణపేట మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రాంకిషన్, టీఎస్‌ఎంఐడీసీ ఈఈ జైపాల్‌రెడ్డి, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డా. రంజిత్‌కుమార్, ఆర్‌ఎంఓ పావని ఉన్నారు.

**పాలశీతలీకరణ కేంద్రం సందర్శన..**

జిల్లాకేంద్రంలో బల్క్‌మిల్క్ కూలింగ్ యూనిట్‌ను త్వరగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. సోమవారం సాయంత్రం జిల్లాకేంద్రంలోని పర్మారెడ్డికాలనీ సమీపంలో ఉన్న పాలశీతలీకరణ కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. యూనిట్ ప్రారంభానికి అవసరమైన యంత్రాలు ఏవేవి వచ్చాయని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి శ్రీనివాస్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. 30వ తేదీ నాటికి యూనిట్ ప్రారంభించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. శిథిలావస్థకు చేరిన ఓ భవనాన్ని కూల్చి వేయాలని, కేంద్రం చుట్టూ ఉన్న చెత్తా చెదారాన్ని తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. ట్రైనీ కలెక్టర్ గరీమానరుల ఉన్నారు.

# మరో 10 నామినేషన్లు



నాగర్‌కర్నూల్‌లో కలెక్టర్ ఉదయ్‌కుమార్‌కు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న భరత్ ప్రసాద్

● పాలమూరులో 4, నాగర్‌కర్నూల్ 6 చొప్పున దాఖలు

**మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ/ నాగర్‌కర్నూల్:** ఉమ్మడి జిల్లాలోని రెండు పార్లమెంట్ సెగ్మెంట్లకుగాను సోమవారం మరో 10 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానానికి విడుతలై చిరుతైగల్ కచ్చి (వీసీకే) పార్టీ అభ్యర్థిగా కె.శంకర్‌రెడ్డి ఒక సెట్, కాంగ్రెస్ (ఐఎన్‌సీ) పార్టీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి తరపున శాంతయ్యయాదవ్ మూడో సెట్, స్వతంత్ర అభ్యర్థులు కె.రామలింగప్ప ఒక సెట్, ఎస్.సరోజనమ్మ రెండు సెట్ల నామినేషన్ పత్రాలను జిల్లా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రవినాయక్‌కు అందజేశారు. అలాగే నాగర్‌కర్నూల్ స్థానానికి గాను పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా ప్రసంగి ఒక సెట్ నామినేషన్, అలియన్స్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫామ్స్ పార్టీ అభ్యర్థిగా అంబోజు రవి ఒక సెట్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్లురవి తరపున ఆయన భార్య రాజ బన్సీదేవి మల్లు ఒక సెట్, భారత రాష్ట్ర సమితి పార్టీ అభ్యర్థిగా రేపల్లె శివ (ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్) ఒక సెట్, బీజేపీ అభ్యర్థిగా పోతుగంటి రాములు ఒక సెట్, బీజేపీ అభ్యర్థిగా పోతుగంటి భరత్ ప్రసాద్ ఒక సెట్ నామినేషన్ పత్రాలు దాఖలు చేశారని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఉదయ్‌కుమార్ తెలిపారు.



రాళ్లలో నడక సాగిస్తున్న భక్తులు



సలేశ్వరం కొండల్లో భక్తులు



కొండ చరియల్లో కాలినడకన భక్తులు

# వస్తున్నాం.. లింగమయ్యా..

## వైభవంగా ప్రారంభమైన సలేశ్వరం ఉత్సవాలు

- మొదటిరోజు వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- పగటిపూట అనుమతి, ఎండల తీవ్రతతో అవస్థల పాలు
- తెలంగాణ అమరనాథ్ సాహస యాత్రకు క్యూకట్టిన జనం
- నట్టడవిలో మార్మోగుతున్న లింగమయ్య నామస్మరణ



జలపాతం వద్ద స్నానాలు చేస్తున్న భక్తులు



**అచ్చంపేట/అమ్రాబాద్:** తెలంగాణ అమరనాథ్ యాత్రగా ప్రసిద్ధిగాంచిన సలేశ్వరం లింగమయ్య ఉత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభయ్యాయి. పున్నమికి ముందురోజు మదినిండా లింగమయ్యను స్మరించుకుంటూ వేలాది మంది భక్తులు నల్లమల బాటపట్టారు. 'వస్తున్నాం.. లింగమయ్యా..' అంటూ దట్టమైన అడవిలో లోయలు, గుట్టలు దాటుకుంటూ సాహస యాత్రలో ఉత్సాహంగా ముందుకు కదిలారు. గతంతో పోల్చితే సోమవారం భక్తుల తాకిడి పెద్దగా కనిపించలేదు. భగభగమండుతున్న ఎండల్లో పగటి వేళ ప్రయాణం చేయలేకపోవడం ఒకటైతే.. అటవీశాఖ రాత్రివేళ భక్తులను అనుంతిచకపోవడం మరో కారణంగా చెప్పవచ్చు. మరోవైపు అటవీశాఖ ఐదురోజుల జాతరను మూడురోజులకు కుదించడం, రాత్రి సమయంలో భక్తులను అనుమతించకపోవడంతో సలేశ్వరం లింగమయ్యను దర్శించుకొనేందుకు భక్తులు పగలే బారులుతీరారు. చెంచు పూజారులు లింగమయ్యకు గిరిజన సంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజలు చేశారు. ఇరుకైన కొండ, కోనల్లో నడక సాగిస్తూ సలేశ్వరం జలపాతం వద్ద పర్యాటకులు స్నానాలు ఆచరించి.. లింగమయ్యను దర్శించుకొని తరించారు.

### బారులుతీరిన వాహనాలు

ఫర్హాబాద్ నుంచి రాంపూర్ చెంచుపెంట వరకు వాహనాలు బారులు దీరాయి. మరోమార్గమైన అప్పాయిపల్లి– గిరిజన గుండాల వద్ద జన సందోహం నిండుగా కనిపించింది. రెండు తెలుగు రాష్ట్రాల తోపాటు కర్ణాటక, మహారాష్ట్రల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. లోయలో పైనుంచి జాలువారుతున్న నీటి ధారలో యువకులు కేరింతలు కొడుతూ సేదతీరారు. లింగమయ్యను దర్శించుకునే క్రమంలో అలసిపోయిన భక్తులు పొంచి ఉన్న ప్రమాదాలను లెక్క చేయకుండా చెట్లు, పుట్టలు, గుట్టల నడుమ సేదతీరుతున్నారు. ఆలయం, జలపాతం వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు, ప్రమాదాలు తలెత్తకుండా వలంటీర్లు సహకారం అందిస్తున్నారు.

### నిరంతర పర్యవేక్షణ

పోలీస్, అటవీ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్ శాఖలు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాయి. సీసీ, ట్రాప్ కెమెరాల ద్వారా అడవి మార్గంలో నిరంతర పర్యవేక్షణ చేసేలా ఏర్పాట్లు చేశారు. ఫర్హాబాద్– రాంపూర్– సలేశ్వరం క్షేత్రం వరకు పోలీసులు ప్రత్యేక బందోబస్తు కల్పిస్తున్నారు. డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో సీఐలు, ఎస్‌ఐలు బందోబస్తు పర్యవేక్షిస్తున్నారు.

### పుల్లాయిపల్లి వరకే బస్సులు

సలేశ్వరం జాతరకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపిస్తోంది. అయితే పుల్లాయిపల్లి పెంట వరకు మాత్రమే బస్సులు వెళ్తున్నాయి. అక్కడి నుంచి మోకాళ్ల కురువ చేరుకునేందుకు 50 ఆటోలు అందుబాటులో ఉంచారు. రాంపూర్ వరకు ఉన్న రోడ్డు పరిస్థితి, వర్షం పడితే కలిగే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈసారి ముందుస్తుగా పుల్లాయిపల్లి వరకు బస్సులను అనుమతించారు. 20 నిమిషాలు ఒక బస్సు చొప్పున ప్రయాణికులకు వీలుగా నడిపిస్తున్నారు. సోమవారం అచ్చంపేట డిపో నుంచి 16, నాగర్‌కర్నూల్ 23, కొల్లాపూర్ 4, కల్వకుర్తి 4 బస్సుల చొప్పున మొదటి రోజు పుల్లాయిపల్లి వరకు బస్సులు నడిపించారు.



### అన్నదానం.. తాగునీటి వసతి

సలేశ్వరం వచ్చే భక్తుల కోసం మోకాళ్ల కురువ, అప్పాయిపల్లి మార్గంలోని గిరిజన గుండాల వద్ద స్వచ్ఛంద సంస్థలు, దాతలు ఏర్పాటు చేసిన అన్నదానం, చలివేంద్రాలు భక్తులను ఆదుకుంటున్నాయి. అల్పాహారం మొదలుకొని మధ్యాహ్నం, రాత్రి సమయంలో భోజనాలు, రాగి అంబలి, మజ్జిగ, తాగునీటి సౌకర్యాలు కల్పిస్తున్నారు. అలాగే ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో తాగునీటి ఏర్పాట్లు చేశారు. ఫర్హాబాద్ చెక్‌పోస్టు, పుల్లాయిపల్లి బేస్ క్యాంపు, రాంపూర్ పెంట, మోకాళ్ల కుర్వు (సలేశ్వరం), లింగాల మండలం అప్పాయిపల్లి, గిరిజన గుండాల వద్ద 5 వేల లీటర్ల వాటర్ ట్యాంకులు, చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. అదేవిధంగా దాతలు ఏర్పాటు చేసిన ఉచిత భోజనశాలలతో పాటు 20 ట్యాంకర్లతో నీరు సరఫరా చేస్తున్నారు. మూడు రోజులపాటు తాగునీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నట్లు డీఈ హేమలత తెలిపారు.

# నేడు మద్దూరుకు సీఎం

● కార్యకర్తల సమావేశం.. తిమ్మారెడ్డిపల్లిలో బావాజీ దర్శనం

**మద్దూరు:** ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి మంగళవారం ఉమ్మడి మద్దూరు మండలంలో పర్యటించనున్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పట్టణంలోని గ్రీన్ ప్యాలెస్ ఫంక్షన్ హాల్‌లో జరిగే నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారు. ఫంక్షన్‌హాల్ పక్కనే హెలీప్యాడ్ ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి రోడ్డుమార్గాన కొత్తపల్లి మండలం తిమ్మారెడ్డిపల్లిలో జరిగే గురులోకామాసంద్ ప్రభు ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేస్తారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన తిరిగి మద్దూరుకు చేరుకొని హెలికాప్టర్‌లో నాగర్‌కర్నూల్‌లో జరిగే సభకు బయలుదేరి వెళ్తారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లును పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, సీఎం అన్న తిరుపతిరెడ్డి, రాష్ట్ర పోలీస్ హౌజింగ్ కార్పొరేషన్ చైర్మన్ గుర్నాథ్ రెడ్డి పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికా రెడ్డి, పార్టీ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు హాజరుకానున్నారు.

**పటిష్ట బందోబస్తు..**

డీఐజీ ఎల్‌ఎస్ చౌహన్, ఎస్పీ యోగేష్ గౌతమ్ మద్దూరులోని గ్రీన్ ప్యాలెస్ ఫంక్షన్‌హాల్, తిమ్మారెడ్డిపల్లిలోని గురులోకామాసంద్ ప్రభు అలయ పరిసరాలు సోమవారం పరిశీలించారు. ట్రాఫిక్ మళ్లింపు, బారికేడ్ల ఏర్పాట్లు తదితర అంశాలపై పోలీస్‌స్టేషన్‌లో పోలీసులకు దిశానిర్దేశం చేశారు. బందోబస్తులో ముగ్గురు అడిషనల్ ఎస్పీలు, 10 మంది డీఎస్పీలు, 60 మంది సీఐలు, ఎస్ఐలు, 400 మంది పోలీసులు పాల్గొననున్నారు.



తిమ్మారెడ్డిపల్లిలోని ఆలయ పరిసరాలను ఎస్పీతో కలిసి పరిశీలిస్తున్న డీఐజీ ఎల్ఎస్ చౌహాన్

### సీఎం టూర్ షెడ్యూల్

- ■ మధ్యాహ్నం 12 గంటలకు హెలికాప్టర్‌లో మద్దూరుకు చేరుకుంటారు.
- ■ మధ్యాహ్నం ఒంటిగంట వరకు కార్యకర్తల సమావేశం.
- ■ 1.30 వరకు భోజన విరామం
- ■ మధ్యాహ్నం 2 వరకు రోడ్డుమార్గంలో తిమ్మారెడ్డిపల్లికి భూనీడ్ మీదుగా చేరుకుంటారు. ప్రత్యేక పూజల అనంతరం తిరిగి మద్దూరుకు తిరుగు ప్రయాణం.
- ■ మధ్యాహ్నం 3 గంటలకు హెలికాప్టర్‌లో నాగర్‌కర్నూల్‌కు బయలుదేరుతారు.

# భక్తిశ్రద్ధలతో బండారు ఉత్సవం



బండారు చల్లుతున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

**మక్తల్:** కుర్వ కులస్తుల ఆరాధ్య దైవం బీరప్ప ఉత్సవాలు మండలంలోని భూత్పూర్‌లో ఘనంగా కొనసాగుతున్నాయి. సోమవారం రెండోరోజు బీరప్ప ఆలయం వద్ద బండారు ఉత్సవం నిర్వహించారు. శరీరంపై పసుపు చల్లుకుంటే శుభాలు జరుగుతాయని భక్తుల నమ్మకం. ఐదేళ్లకు ఓసారి జరిగే ఉత్సవాలకు కర్ణాటక, మహారాష్ట్ర, హైదరాబాద్ తదితర ప్రాంతాల భక్తులు తరలివచ్చారు. ఉత్సవాలకు సుమారు 40 వేల మంది భక్తులు హాజరుకాగా వారంతా కొత్త దుస్తులు ధరించి పసుపు చల్లుకునేందుకు పోటీపడ్డారు. ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఈ కార్యక్రమం ప్రారంభించి కుర్వ కులస్తులపై బండారు చల్లి ఆశీర్వదించారు. అనంతరం ఎమ్మెల్యేను గొంగడి, శాలువాతో సన్మానం చేశారు. కార్యక్రమంలో గోపాల్‌రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కోళ్ల వెంకటేష్, తాయప్ప, రవికుమార్, కుర్వ హన్మంతు, నర్సింహగౌడ్, చెన్నయ్యగౌడ్, సి.చంద్రశేఖర్, ఎస్ఐ వైపీ లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. మాజీ సర్పంచ్ కుర్వ హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు ప్రజావాణికి 8 వినతులు

**నారాయణపేట రూరల్:** జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణికి ఎనిమిది ఫిర్యాదులు వచ్చాయి. అర్జీదారులతో ఎస్పీ యోగేష్ గౌతమ్ నేరుగా మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారి నుంచి అర్జీలు స్వీకరించి సంబంధిత ఎస్ఐలకు బదిలీ చేసి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు సైతం దృష్టి సారించి చట్ట ప్రకారం పరిష్కరించాలని, త్వరగా పూర్తి చేయించాలన్నారు. భూసమస్యల పరిష్కారానికి న్యాయస్థానాన్ని ఆశ్రయించాలని సూచించారు. అత్యవసర సమయంలో డయల్ 100, 112ను సంప్రదించాలన్నారు.

# ఎన్నికల వరకే ఆరు గ్యారంటీల మాట

జడ్చర్ల/ఆత్మకూర్: కాంగ్రెస్ ప్రభుత్వం పార్లమెంట్ ఎన్నికల వరకే ఆరు గ్యారంటీల మాట మాట్లాడుతుందని.. ఆ తర్వాత పథకాలకు గుడ్‌బై చెప్పడం ఖాయమని మహబూబ్‌నగర్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం జడ్చర్లలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మాజీ మంత్రులు లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్‌లతో కలిసి బీఆర్‌ఎస్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం, ఆత్మకూర్‌లో మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అధ్యక్షతన అమరచింత, ఆత్మకూర్ మండలాల కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీ మన్నె మాట్లాడుతూ అబద్దపు హామీలతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. గ్యారంటీ లేని కాంగ్రెస్‌తో ప్రజలకు నష్టమే మిగిలిందన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఉందా లేదా అన్న అనుమానాలు అందరిలో కలుగుతున్నాయని అన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో అమలుచేసిన అనేక సంక్షేమ పథకాలు నిలిచిపోయాయని తెలిపారు. కరెంటు సరఫరా, ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా జరగడం లేదన్నారు. రైతులను గాలికొదిలేశారని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చి, ఎక్కడా అమలు చేయలేదన్నారు. అసెంబ్లీ ఎన్నికల మాదిరిగా ప్రజలు మరో సారి మోసపోవద్దని.. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. మాజీ మంత్రులు లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పాలనలో అమలుచేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి గెలుపునకు కృషి చేయాలని కోరారు. ఆయా సమావేశాల్లో మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, ఎస్.రాజేందర్‌రెడ్డి, జెడ్పీ వైస్‌చైర్మన్ యాదయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్లు లక్ష్మి, గాయత్రి, మంగమ్మ, జెడ్పీటీసీ శివరంజని, ఎంపీపీ బంగారు శ్రీనివాసులు, గోవర్ధన్‌రెడ్డి, శ్రీధర్‌గౌడ్, రవికుమార్, రమేష్, ఎస్‌ఏ రాజు ఉన్నారు.


మాట్లాడుతున్న ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, చిత్రంలో మాజీ మంత్రులు లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్

## బీజేపీ పగటి కలలు నెరవేరవు


సింగోటంలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్ రూరల్: బీజేపీ పగటి కలలు నెరవేరని, ఈసారి రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి కాబోతున్నారని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సోమవారం మండలంలోని ఎన్మన్‌బెట్ల, సింగోటం, జావాయిపల్లి తదితర గ్రామాల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లురవి తరఫున ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సింగోటంలో విలేకరులతో మాట్లాడారు. రాహుల్‌గాంధీ దేశ ప్రజలకు ఇచ్చిన ఐదు న్యాయ్ గ్యారంటీలను రాష్ట్రంలో కచ్చితంగా అమలు చేస్తామన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ 15 ఎంపీ స్థానాలు గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ పార్టీకి ఒక్క సీటు కూడా రాదని, బీజేపీకి రాష్ట్రంలో ఒక సీటు రావొచ్చు అని జోస్యం చెప్పారు. రాష్ట్రంలో ఇప్పటికే ఇచ్చిన హామీ మేరకు ఐదు గ్యారంటీలను అమలు చేశామన్నారు. కొల్లాపూర్ ప్రజల అభివృద్ధి కోసం కాంగ్రెస్‌కు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు.

ప్రచార పర్వం

# మహిళలు బీజేపీకే మద్దతివ్వాలి

పాలమూరు/ దామరగిద్ద/ మరికల్: మహిళలు తల ఎత్తుకొని జీవించేలా ఆర్థిక స్వతంత్రులు చేసిన ఘనత ప్రధాని మోదీకే దక్కుతుందని, చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ బిల్లు తీసుకురావడం వల్ల ఎంతో మేలు జరిగిందని మహబూబ్‌నగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ అన్నారు. జిల్లా మహిళా మోర్చా ఆధ్వర్యంలో సోమవారం మహబూబ్‌నగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన మహిళల ఆత్మీయ సమ్మేళనంలో ఆమె పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల్లో భాగంగా మహిళలకు ఇచ్చిన హామీలు ఒక్కటైనా అమలు చేశారా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళలకు తీవ్ర అన్యాయం చేశారని, ఈసారి మహిళలు బీజేపీకే మద్దతివ్వాలని కోరారు. కల్వకుర్తి నుంచి వచ్చి మన ఆడబిడ్డను తొక్కుతాం అంటే ఊరుకుంటామా అని అడిగారు. వీళ్ల పాలమూరుకు ఏం చేయడానికి చేత గాదు కాని.. చిల్లర మాటలు మాత్రం మాట్లాడతారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి అధికారం చూసుకొని నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని, ఒకప్పుడు కేసీఆర్ తిట్ల దండకం ఉంటే ఇప్పుడు రేవంత్‌రెడ్డి వచ్చాడన్నారు. తిట్ల దండకంలో కేసీఆర్ పీహెచ్‌డీ చేస్తే.. మరి రేవంత్‌రెడ్డి ఏం చేశాడో తెలియడం లేదన్నారు. గత 60 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో చేయని ప్రగతి కేవలం పదేళ్లలోనే మోదీ చేసి చూపించారన్నారు. ప్రతి మహిళ బీజేపీకి మద్దతు తెలిపి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు సాహితీరెడ్డి, బీజేపీ నేత నాగురావు నామాజీ తదితరులు పాల్గొన్నారు. అలాగే దామరగిద్ద, మరికల్‌లో నిర్వహించిన రోడ్‌షోల్లోనూ ఆమె పాల్గొని మాట్లాడారు. కేంద్రం నిధులతోనే పల్లెలో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నాయన్నారు. అనంతరం అప్పంపల్లి ఊర చెరువును కోయిల్‌సాగర్ నీటితో నింపాలని గ్రామస్తులు కోరగా.. తాను గెలిచిన తర్వాత తప్పకుండా నెరవేరుస్తానని హామీ ఇచ్చారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా అధ్యక్షుడు పగడాకుల శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రతంగ్‌పాండురెడ్డి, పార్లమెంట్ ప్రభారీ బుడ్డన్న, సత్యయాదవ్, మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు లక్ష్మి, నాయకులు శ్రీనివాస్, నర్సన్‌గౌడ్, ఉమేష్, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


దామరగిద్ద మండలం నర్సాపూర్‌లో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న డీకే అరుణ

# పేదల పక్షాన నిలబడి కొట్లాడుతాం

బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

గోపాల్‌పేట: బీజేపీకి ఓటేస్తే అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని రద్దుచేసి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల రిజర్వేషన్లు తొలగిస్తుందని బీఆర్‌ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. సోమవారం ఆయన మొదట రేవల్లి మండలంలోని బండరావిపాకులలో పర్యటించి మాట్లాడారు. గతంలో ఈ గ్రామాన్ని సందర్శించి గ్రామస్తుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేశానని.. ప్రస్తుతం పార్లమెంటు ఎన్నికల్లో పోటీలో ఉన్నందున గెలిపించాలని కోరారు. అనంతరం రేవల్లిలో మాట్లాడారు. ప్రజల సమస్యలు పరిష్కరించేందుకే బీఆర్‌ఎస్ పార్టీ తరఫున పోరాడుతున్నానని తెలిపారు. తర్వాత గోపాల్‌పేటలో కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. ఆరు గ్యారెంటీ హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌పార్టీ ఇప్పటి వరకు ప్రజలకు సహజమైన పాలన అందించలేకపోతోందని విమర్శించారు. తనను గెలిపిస్తే పేదల గళాన్ని పార్లమెంట్‌లో వినిపిస్తానని చెప్పారు. ఆయన వెంట మాజీ వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి ఉన్నారు.


బండరావిపాకులలో మాట్లాడుతున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

# ప్రతి కార్యకర్త బాధ్యతగా పనిచేయాలి

పాలమూరు: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు ప్రతి కార్యకర్త బాధ్యతగా పనిచేయాలని కర్ణాటక రాష్ట్రం బెల్గాం ఎమ్మెల్యే అభయ్ పాటిల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం పార్లమెంట్ కన్వీనర్ డోకూర్ పవన్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన మహబూబ్‌నగర్, దేవరకద్ర అసెంబ్లీ నియోజకవర్గాల ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ మండల అధ్యక్షులకు అప్పగించిన బాధ్యతలను నిర్వర్తించడంలో నిర్లక్ష్యం చేయకూడదని సూచించారు. ప్రతి బూత్ స్థాయిలో యువత ఓట్లు, 80 ఏళ్లు నిండిన వారి గుర్తింపు ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు పొందిన లబ్ధిదారులను నేరుగా కలిసి అభిప్రాయాలను తెలుసుకోవాలని తెలిపారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాస్‌రెడ్డి, పార్లమెంట్ ఇన్‌చార్జి ఏవీఎన్ రాజురెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పద్మజారెడ్డి, ఎగ్గని నర్సింహులు, సుదర్శన్‌రెడ్డి, రమేష్, కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బెల్గాం ఎమ్మెల్యే అభయ్ పాటిల్

# దేశం కోసం ఓటేయండి

నాగర్‌కర్నూల్/ బిజినేపల్లి: ప్రపంచ దేశాల్లోనే అగ్రగామిగా నిలబడటానికి, దేశంలో సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకోవడానికి బీజేపీకి ఓటేయాలని నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి భరత్ ప్రసాద్ అన్నారు. సోమవారం ఆయన బిజినేపల్లి, తిమ్మాజిపేట మండలాల పరిధిలోని పాలెం, బిజినేపల్లి, మంగనూర్, చేగుంట, గోరిట గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 370 ఆర్టికల్ రద్దు, నోట్ల రద్దు, ఉగ్ర దాడులను నిలవరించడం, ఉచితంగా కరోనా టీకా పంపిణీ, ఆర్థిక సంస్కరణలు చేపట్టడం, గ్రామాల్లో రైతువేదికల నిర్మాణం, సీసీరోడ్లు, మురుగు కాల్వలు, పల్లె ప్రకృతి వనాల ఏర్పాటు వంటి అభివృద్ధి కార్యక్రమాలు ఎన్నో బీజేపీ చేసిందన్నారు. బీజేపీ చేసిన అభివృద్ధి ప్రతిరోజు కళ్లకు కనిపిస్తుందన్నారు. రాష్ట్ర అధికార ప్రతినిధి దిలీపాచారి మాట్లాడుతూ దేశ రక్షణ కోసం, పిల్లల బంగారు భవిష్యత్ కోసం ఆలోచించి బీజేపీకి ఓటేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు భూషయ్య, నారాయణచారి, సుధాకర్‌రెడ్డి, బాల్‌రెడ్డి, బాలయ్య, ఉమాదేవి, ప్రవీణ్, శివ తదితరులు పాల్గొన్నారు.

■ జిల్లాకేంద్రంలోని ఉన్నత పాఠశాల మైదానంలో సోమవారం ఉదయం భరత్ ప్రసాద్ వాకర్స్‌తో కలిసి మార్నింగ్ వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రౌండ్‌లో వ్యాయామం చేస్తున్న ప్రతి ఒక్కరిని పలకరిస్తూ వారితో ముచ్చటించారు. బీజేపీ అభ్యర్థిగా తమ ముందుకు వచ్చానని ఓటు వేసి గెలిపించాలని కోరారు. గెలిస్తే ఈ ప్రాంత అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడతానన్నారు.


నాగర్‌కర్నూల్‌లో వాకర్స్‌తో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి భరత్ ప్రసాద్

## క్లుప్తంగా

### బైక్ అదుపు తప్పి

● తండ్రి మృతి, కుమారుడికి గాయాలు


నవత్‌రెడ్డి(ఫైల్)

కోస్గి: బైక్‌పై వెళ్తుండగా పంది అడ్డురావడంతో తప్పించబోయి కిందపడడంతో తండ్రి మృతి చెందగా, కుమారికి తీవ్ర గాయాలైన ఘటన గుండుమాల్ మండల పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ శేఖర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మద్దూర్ మండలం చింతల్‌దిన్నెకు చెందిన నవత్‌రెడ్డి(41) తన కుమారుడు శివకుమార్‌రెడ్డితో కలిసి ద్విచక్ర వాహనంపై సోమవారం తెల్లవారు జామున హైదరాబాద్‌కు బయలుదేరారు. ఈ క్రమంలో గుండుమాల్ మండలం బోగారం శివారులో అకస్మాత్తుగా పంది అడ్డురావడంతో తప్పించే క్రమంలో బైక్ అదుపుతప్పి కిందపడ్డారు. దీంతో నవత్‌రెడ్డి తలకు గాయాలై తీవ్ర రక్తస్రావమైంది. శివకుమార్‌రెడ్డి సైతం గాయపడ్డాడు. అటుగా వెళ్తున్న కొందరు గమనించి మహబూబ్‌నగర్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ నవత్‌రెడ్డి ఆస్పత్రిలో మృతి చెందాడు. శివ కుమార్‌రెడ్డి చికిత్స పొందుతున్నాడు. ఘటనపై భార్య బాలమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### ఉద్యోగం రావడం లేదని.. యువకుడి బలవన్మరణం

మక్తల్: ప్రభుత్వ ఉద్యోగం రావడంలేదని మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మక్తల్ మండలం రుద్రసముద్రం గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. రుద్రసముద్రానికి చెందిన చెందిన శివకుమార్ (23) గ్రూప్స్ ఇతర పోటీ పరీక్షలు రాశాడు. ఈక్రమంలో తన తోటి వారికి ఉద్యోగాలు రాగా.. తనకు రాకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి వరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ భాగ్యలక్ష్మీరెడ్డి తెలిపారు.

### తెగిపడిన విద్యుత్ వైర్: తప్పిన ప్రమాదం



వీపనగండ్ల: మండలంలోని గోపల్‌దిన్నెలో దేవాలయ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు చెత్తకు నిప్పు పెట్టడంతో భారీగా మంటలు ఎగిసిపడ్డాయి. ఆ ప్రదేశానికి అతి సమీపంలో ఉన్న 11 కేవీ విద్యుత్ వైర్లు కాలి తెగి పడ్డాయి. గ్రామంలో వాటర్‌మన్‌గా పనిచేస్తున్న రాజన్‌గౌడ్ విషయాన్ని విద్యుత్ అధికారులకు, గ్రామస్తులకు తెలపడంతో అప్రమత్తమైన విద్యుత్ అధికారులు సరఫరాను నిలిపివేశారు. వెంటనే పారిశుద్ధ్య కార్మికులు, గ్రామస్తుల సహకారంతో నీళ్లను పోసి మంటలను అదుపులోకి తెచ్చారు. దీంతో పెనుప్రమాదం తప్పిందని గ్రామస్తులు తెలిపారు.

# తనిఖీల్లో నగదు పట్టివేత


ఖిల్లాఘనపురంలో పట్టుబడిన నగదుతో పోలీసులు


బాలానగర్‌లో పోలీసులు సీజ్ చేసిన నగదు

గట్టు: లోకసభ ఎన్నికల్లో భాగంగా వాహన తనిఖీల్లో పోలీసులు సోమవారం రూ.6.9 లక్షలను పట్టుకున్నారు. మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద తనిఖీ చేస్తున్న క్రమంలో రాయాపురం గొర్ల రామకృష్ణ వద్ద రూ.2.9 లక్షలను పట్టుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ వెంకటేష్ తెలిపారు. కర్ణాటక సరిహద్దులోని కర్నూలు–రాయచూర్ అంతర్రాష్ట్ర రహదారి బల్గెర చెక్ పోస్టు వద్ద వాహన తనిఖీల్లో తుమ్మలచెరువుకు చెందిన పెద్ద గోవిందు నుంచి రూ.4 లక్షలను స్వాధీనం చేసుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు. పట్టుబడిన నగదును జిల్లా గ్రీవెన్స్ సెల్‌కు అప్పగించి, జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలో సోమవారం పోలీసులు చేపట్టిన తనిఖీల్లో అనుమతులు లేకుండా రూ.1.70 లక్షలు తరలిస్తున్న నగదును సీజ్ చేసినట్లు ఎస్ఐ శ్రీహరి తెలిపారు. మండలంలోని ఆగారం చెందిన చంద్రశేఖర్ బైక్‌పై ఖిల్లాఘనపురం నుంచి ఆగారం వైపు నగదును తీసుకెళ్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు.

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరు చెక్‌పోస్టు వద్ద బస్సులో వెళ్తున్న వ్యక్తుల వద్ద రూ.1,15,600 నగదును పట్టుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. తమిళనాడుకు చెందిన నింగప్ప కర్నూల్ నుంచి హైదరాబాద్‌కు బస్సులో వెళ్తుండగా రూ.58,100 నగదును, మరో బస్సులో నంద్యాల నుంచి హైదరాబాద్‌కు ప్రయాణిస్తున్న మురళీధర్ వద్ద రూ.57,500 నగదును పట్టుకున్నట్లు తెలిపారు.

బాలానగర్: మండల కేంద్రంలోని పోలీస్ చెక్‌పోస్టులో 1,03,000 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండకు చెందిన బాలకిష్టయ్య వద్ద నగదుకు ఎలాంటి పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసినట్లు ఎస్ఐ తిరుపాజి తెలిపారు.

## ఆకట్టుకున్న చిన్నారి ప్రతిభ


రామాలయ చిత్రం


రావి ఆకుపై ఆంజనేయస్వామి

కల్వకుర్తిరూరల్: పట్టణానికి చెందిన యశ్వంత్ తన ప్రతిభను చాటాడు. హనుమాన్‌జయంతిని పురస్కరించుకొని సోమవారం రావి ఆకుపై హనుమాన్ చిత్రాన్ని గీశారు. శ్రీలంక నుంచి ఆంజనేయుడి పర్వతంను తీసుకువస్తున్నట్లు సూర్యుడివైపు వెలుతున్నట్లు చిత్రం గీశాడు. దీంతోపాటు అయోధ్యలో నిర్మించిన రామమందిర నిర్మాణాన్ని చిత్రీకరించి ఆకట్టుకున్నాడు.

## రామన్‌పాడులో తగ్గిన నీటిమట్టం

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో నీటిమట్టం క్రమంగా తగ్గుతోంది. సోమవారం 1,011 అడుగులకు నీటిమట్టం చేరింది. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ రసీల్‌రెడ్డి తెలిపారు.

# బావాజీ ఉత్సవాలు ప్రారంభం

మద్దూరు: కొత్తపల్లి మండలం తిమ్మారెడ్డిపల్లిలో వెలసిన గిరిజనుల ఆరాధ్యదైవం గురులోకా మాసంద్ ప్రభు (బావాజీ) ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. వంశపారంపర్య పూజారులు చందర్‌నాయక్, భీమ్లానాయక్, ధన్‌సింగ్, దేవ్లానాయక్ ఆధ్వర్యంలో గురులోకా మాసంద్ ప్రభు, కాళీకాదేవి ఆలయాల్లో ధ్వజారోహణం నిర్వహించారు. అనంతరం ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి.. బావాజీ, కాళికాదేవిని దర్శించుకున్నారు. రాత్రి ప్రభోత్సవం, బంజారా భజనలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.


బావాజీ ఆలయం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

# గర్భిణి మృతిపై వైద్యాధికారుల విచారణ


వేములలో విచారణ చేస్తున్న జిల్లా వైద్యాధికారి కృష్ణ తదితరులు

మిడ్జిల్: గర్భిణి మృతిపై మండలంలోని వేములలో సోమవారం వైద్యాధికారులు విచారణ చేపట్టారు. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన తిర్పతయ్య భార్య జయలక్ష్మి(23) గతంలో ఇద్దరు కవల ఆడపిల్లలకు జన్మనిచ్చింది. తిరిగి గర్భందాల్చడంతో లింగనిర్ధారణ పరీక్షలు చేయగా, మళ్లీ ఆడబిడ్డనే అని తేలడంతో ఆమెకు ఈ నెల మొదటి వారంలో మహబూబ్‌నగర్ ప్రైవేట్ ఆస్పత్రిలో అబార్షన్ చేయగా, పరిస్థితి విషమించడంతో ఆమె మృతి చెందినట్లు దినపత్రికల్లో, సోషల్‌మీడియాలో వార్తలు వచ్చాయి. ఈ విషయంపై సోమవారం జిల్లా వైద్యాధికారి కృష్ణ గ్రామంలో వారి ఇంటికి వెళ్లి విచారించారు. కాగా దీనిపై కుటుంబసభ్యులు వివరాలు వెల్లడించేందుకు నిరాకరించారు. పొలం పనులు చేస్తుండగా ఆమె గట్టుమీద నుంచి కిందపడడంతో భర్త తిరుపతయ్యతో కలిపి జయలక్ష్మి పుట్టినిల్లయిన మూసాపేట మండలం పొల్కంపల్లికి వెళ్లారు. వారి కుటుంబ సభ్యులతో కలిసి మహబూబ్‌నగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా పరీక్షించి కడుపులో బిడ్డ చనిపోయిందని, ఆపరేషన్ చేశారని చెప్పారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని జజ్జిఖాన ఆస్పతికి రెఫర్ చేయగా, కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఈనెల 11వ తేదీన మృతి చెందిందని కుటుంబ సభ్యులు తెలిపారు, జరిగిన విషయం ఇదేనని తెలిపారు. ఈ విషయంపై జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ.. కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయమని అడిగితే నిరాకరిస్తున్నారని, దీనిపై పూర్తి స్థాయిలో విచారించి చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట జిల్లా మాస్ మీడియా అధికారి సుభాష్‌చంద్రబోస్, మండల వైద్యాధికారి శివకాంత్ తదితరులు ఉన్నారు.

# కట్టెల మండిలో అగ్నిప్రమాదం

గద్వాల క్రైం: ఈదురు గాలుల ధాటికి విద్యుత్ వైర్లు ఒక దానికి మరొకటి తాకి నిప్పు రవ్వలు ఎగసిపడటంతో కట్టెల మండిలో మంటలు వ్యాపించి రూ.40 లక్షల ఆస్తినష్టం సంభవించింది. ఈ ఘటనకు సంబంధించి ఫైర్ సిబ్బంది కథనం ప్రకారం.. గద్వాలలోని గంజిపేటకాలనీ సమీపంలో కుంటలకవి అనే వ్యక్తి టింబర్ డిపో (కట్టెల మండి) నిర్వహిస్తున్నాడు. అయితే సోమవారం రాత్రి 9.15 గంటల ప్రాంతంలో పెద్దఎత్తున ఈదురుగాలులు వీచాయి. దీంతో డిపో మీదుగా విద్యుత్ వైర్లు ఉండగా.. ఈదురుగాలుల ధాటికి ఒక దానికి మరొకటి తాకడంతో నిప్పురవ్వలు కట్టెల మండిలో కిందపడి మంటలు వ్యాపించాయి. దీనికి గాలులు తోడవడంతో మంటలు తీవ్రమై డిపోలో నిల్వ ఉంచిన కట్టెలు, యంత్ర సామగ్రి పూర్తిగా కాలిపోయాయి. స్థానికుల సమాచారం మేరకు ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించినా జరగాల్సిన నష్టం జరిగిపోయింది. జిల్లాకేంద్రంలో అకస్మాత్తుగా జరిగిన సంఘటనతో అటుగా వెళ్తున్న ప్రజలు, కాలనీవాసులు భయాందోళనకు గురయ్యారు. సకాలంలో ఫైర్ సిబ్బంది రావడంతో కొంతమేర ఆస్తి నష్టం కాపాడారని స్థానికులు తెలిపారు. దాదాపు 40 నిమిషాలకు పైగా ఫైర్ సిబ్బంది శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు.


కట్టెల డిపోలో ఎగసిపడుతున్న మంటలు

## భక్తిశ్రద్ధలతో పబ్బతి అంజన్న ఉత్సవాలు


ఆలయంలో పూజలు చేస్తున్న పండితులు

అమ్రాబాద్: పదర మండలంలోని మద్దిమడుగులో పబ్బతి ఆంజనేయస్వామి జయంతిమాల విరమణ ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. సోమవారం ద్వాదశ వాస్తుపూజ, హోమం, మన్యుసూక్త హోమం, గవ్యాంతర పూజల అనంతరం స్వామివారికి గరుడ వాహన సేవ నిర్వహించారు. రాత్రి సీతారాముల కల్యాణోత్సవాన్ని వేదమంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల మధ్య కనుల పండువగా జరిపించారు. కార్యక్రమంలో ఈఓ రంగాచారి, జైపాల్‌రెడ్డి, జంగయ్య, ప్రధాన అర్చకుడు వీరయ్యశర్మ పాల్గొన్నారు.

## సీతారామస్వామికి గజవాహన సేవ


సీతారామస్వామికి గజవాహన సేవ నిర్వహిస్తున్న భక్తులు

చారకొండ: మండలంలోని సిర్సనగండ్ల సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం స్వామివారికి ప్రత్యేక పూజల అనంతరం గజవాహన సేవ నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రామశర్మ, ఈఓ శ్రీనివాస్‌రెడ్డి, మేనేజర్ నిరంజన్, అర్చకులు లక్ష్మణ్ శర్మ, మురళీధర్‌శర్మ, ప్రవీణ్‌శర్మ, వేణుగోపాల్ శర్మ, కోదండరామ శర్మ, సీతారామశర్మ నిర్వహించారు.